# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

**హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**అక్షర దర్బార్, దుగ్గొండి :** విద్యార్థులు క్రీడల్లో రాణించాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. ఈనెల 7,8 తేదీల్లో హన్మకొండ జేఎన్ఎస్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్, సబ్ జూనియర్ రెజ్లింగ్ పోటీల్లో మండలంలోని ఆదర్శవాణి పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్, సిల్వర్, బ్రౌన్స్ మెడల్స్ సాధించారు ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ శనివారం విద్యార్థులను అభినందించారు. జాతీయ స్థాయికి ఎంపికైన భరత్ ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నగనబోయిన రవి, అశోక్ కుమార్, ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శానబోయిన రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి యాదగిరి, సుధాకర్, ట్రెజరర్ కందికొండ రాజు, గౌరవ అధ్యక్షుడు గుండేటి రవీందర్, కోచ్ లు ఇటికాల దేవేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

**జాతీయ స్థాయి పోటీలకు 'కస్తూర్బా' విద్యార్థిని**

విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మల్లంపల్లి కస్తూర్బా గురుకుల విద్యాలయం ప్రత్యేక అధికారిని మంజుల తెలిపారు. పాఠశాల విద్యార్థిని కీర్తన రాష్ట్రస్థాయి రగ్బీపోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా శనివారం ప్రత్యేకాధికారిణి మంజుల విద్యార్థిని కీర్తన, పీఈటీ లావణ్యను అభినందించారు.


సర్వే వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్


## సర్వే వివరాల నమోదును వేగంగా పూర్తి చేయాలి

**జనగామ కలెక్టర్ శివలింగయ్య**

**అక్షర దర్బార్, జనగామ :** మహాలక్ష్మీ పథకంలో భాగంగా గ్యాస్ సబ్సిడీ కోసం వినియోగదారుల సమగ్ర వివరాలను వేగంగా యాప్ లో నమోదు చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ శివలింగయ్య అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ తో కలిసి పట్టణంలోని గణేష్ వాడలో పర్యటించారు. యాప్ లో ఏవిధంగా నమోదు చేస్తున్నారనే వివరాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో డీసీపీస్వో ఎం.రోజా రాణి, మున్సిపల్ కమిషనర్ చంద్రమౌళి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్ వాస్తవికంగా ఉండాలి

- **గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చింది**
- **సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**



**అక్షర దర్బార్, వరంగల్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ వాస్తవికంగా ఉండాలని, గొప్పలకుపోయి రాష్ట్రాన్ని అప్పులపాలు చేయొద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ఆయన స్పందిస్తూ గత బీఆర్ఎస్ పాలనతో రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా మారిందని, ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. యూనివర్సిటీల్లో మౌలిక సదుపాయాల కోసం బడ్జెట్ లో కేటాయించిన రూ.500కోట్లు ఏ మేరకు సరిపోవని, ప్రతీ యూనివర్సిటీకి రూ.300కోట్ల చొప్పున నిధులు కేటాయించి ఉన్నత విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలని కోరారు. కొత్తగా గురుకుల భవనాలే నిర్మాణం కాకుండా అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టళ్లకు కూడా సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. పెండింగులో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు రూ.5500 కోట్లు వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కోరారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కు రూ.300 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చిన బీఆర్ ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా దీనిపై దృష్టి సారించాలని కోరారు. వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపుల్లో కోత విధించొద్దని, పెండింగు ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## వదంతులను నమ్మొద్దు

**హన్మకొండ ఏసీపీ కిరణ్ కుమార్**

**అక్షర దర్బార్, హన్మకొండ:** చిన్నపిల్లలను అపహరించే ముఠా నగరంలో ప్రవేశించిందని సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని హన్మకొండ ఏసీపీ కిరణ్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు ఏసీపీ కమిషనర్ కార్యాలయం నుంచి శనివారం ప్రకటన విడుదల చేశారు. పిల్లలను అపహరించేందుకు ఎలాంటి ముఠాలు నగరంలోకి రాలేదని, అసత్య ప్రచారాలు నమ్మొద్దని సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసు యంత్రాంగం పటిష్టమైన నిఘాతో బందోబస్తు నిర్వహిస్తోందని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో అసత్యాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100, పోలీసు కంట్రోల్ రూమ్ 8712 685070 నెంబరుకు సమాచారం అందించాలని కోరారు.


హన్మకొండ ఏసీపీ కిరణ్ కుమార్

## ఈవీఎంలను పరిశీలించిన నోడల్ అధికారి

**అక్షర దర్బార్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని గోడౌన్ లో భద్రపర్చిన ఈవీఎంల ఫస్ట్ లెవెల్ తనిఖీని శనివారం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తో కలిసి ఈవీఎం నోడల్ అధికారి తిల్లైవల్.బి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఏవో వెంకటరమణ, ఎన్నికల విభాగం అధికారి పవన్ కుమార్, రెవెన్యూ సిబ్బంది, అఖిలపక్ష పార్టీ ప్రతినిధులు సురేష్ నాయుడు, మార్నేని కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సమాచార సేకరణను పరిశీలించిన కలెక్టర్

**అక్షర దర్బార్, శివనగర్ :** ప్రజా పాలనలో భాగంగా గ్యాస్ సబ్సిడీ కోసం వినియోగదారుల అసంపూర్ణ వివరాలను సరి చేసి వేగవంతంగా యాప్ లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. శనివారం నగరంలోని 33 డివిజన్ శాంతినగర్ మహాత్మా గాంధీ కమ్యూనిటీ హాల్లో, 34 డివిజన్ శివనగర్ కార్మిక సంఘం భవనంలో కలెక్టర్ సర్వేను ఆమె పరిశీలించారు. సమాచారాన్ని సవరించడానికి ప్రభుత్వం ఒక్కరోజే గడువు ఇచ్చిన నేపథ్యంలో ఆర్పీలు, అంగన్ వాడీలు, ఆశా, మెప్మా సిబ్బంది అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శివప్రసాద్ రెడ్డి, సూపర్వైజింగ్ అధికారి, ఏఈ హబీబ్, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు కృషి

**సీఐ సూర్యప్రకాశ్**

**అక్షర దర్బార్, వర్ధన్నపేట:** వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ సీఐగా జి సూర్యప్రకాష్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ శ్రీనివాస్ ను ఐజికి అటాచ్ చేసిన ప్రభుత్వం ఆయన స్థానంలో జి .సూర్యప్రకాష్ ను నియమించింది. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామని, మట్కా, గుట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తేలేదని హెచ్చరించారు. కాగా, సీఐకు ఎస్సైలు ప్రవీణ్ కుమార్, మహేందర్, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## నకిలీ ఐస్ క్రీములు పట్టివేత..

**అక్షర దర్బార్, వరంగల్ :** ఎలాంటి అనుమతి లేకుండా ఐస్ క్రీమ్స్ నిలువ ఉంచిన వ్యక్తిని టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. నిర్వాహకుడి నుంచి ఐస్ క్రీములను స్వాధీనం చేసుకున్నారు. తమకందిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు శనివారం ఏనుమాముల బాలాజీనగర్ లోని ఓ ఐస్ క్రీమ్ కంపెనీలో తనిఖీలు నిర్వహించారు. నిర్వాహకుడు గంధం వరప్రసాద్ నాణ్యతలేకుండా, ఎలాంటి అనుమతి లేకుండా ఐస్ క్రీమ్స్ నిలువ చేస్తున్నట్లు గుర్తించారు. దుకాణం నుంచి రూ.29,250 విలువైన నకిలీ ఐస్ క్రీములు, నిషేధిత ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు గంధం వరప్రసాద్ ను విచారించగా ఎలాంటి ఫుడ్ లైసెన్స్ లేకుండానే కంపెనీలో పలు కంపెనీల ఐస్ క్రీములను నిలువ చేసినట్లు అంగీకరించాడు. ఇలాంటి ఐస్ క్రీములు తినడం వల్ల చిన్న పిల్లల్లో ఆరోగ్య సమస్యలు వస్తాయని టాస్క్ ఫోర్స్ వరంగల్ ఏసీపీ మధుసూదన్ మాట్లాడుతూ.. ప్రజలు నాణ్యమైన ఐస్ క్రీమ్ ఉత్పత్తులను గుర్తించి కొనుగోలు చేయాలని సూచించారు.


ఐస్ క్రీములను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు